విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టె వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :164 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 31 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

- ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్

మత్స్యకారుల సమస్యలపై చర్చ

- పడవలకు బీమా కల్పించే యోచన
- నష్టంపై పవన్ కల్యాణ్ సమీక్ష
- ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం
- కాకినాడలో విద్యుత్ అంతరాయం
- ఉప్పాడలో భారీగా తీర కోత
- బీచ్ రోడ్డు ధ్వంసం.. రాకపోకలు బంద్
- 54,435 హెక్టార్లలో పంట నష్టం
- 21 మండలాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

అర్నబ్ తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జరిగిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ పాల్గొన్నారు. జిల్లాలో తుపాను వల్ల జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. "తీరప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి. వేట పడవలకు బీమా కల్పించే అంశంపై ప్రతిపాదనలు – మిగతా2లో

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- 2.6 శాతానికి తీవ్ర పేదరికం.. ఉపాధితో తగ్గిన పేదరికం
- సంక్షేమ పథకాలతో ఊరట.. 2028 నాటికి మరింత తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి.. వీడని ఆదాయ అసమానతలు

నవంబర్ 20 వరకు
గడువు పొడిగింపు

- 30న తుది ఓటర్ల జాబితా
- ఈసీ తాజా ఉత్తర్వులు జారీ
- వివేక్ యాదవ్ వెల్లడి
- ఆరు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్
- అధికారుల అభ్యర్థనతో గడువు పెంపు
- ఢిల్లీకి డిసెంబర్ 22 వరకు గడువు
- దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ తుది దశ

అమరావతి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నవంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో సర్ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. సర్ - మిగతా2లో

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- చివరి శ్వాస వరకు ప్రజాసేవ.. దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- ఎరువులు, గ్యాస్‌పై దుష్ప్రచారం.. రైతులపై ధరల భారం పడనివ్వం
- రైతు సంక్షేమమే లక్ష్యం.. పీఎం-కిసాన్‌కు రూ.4.5 లక్షల కోట్లు
- బనాస్కాంత రైతులపై ప్రశంసలు.. పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం

జనవరి 25 నుంచి జనగణన

- ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మినహాయింపు
- మార్చి 1 అర్ధరాత్రి కీలక గడువు
- జనవరి 10 నుంచే స్వీయ నమోదు
- రెండు దశల్లో జనాభా లెక్కింపు
- జనగణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు
- కరోనా కారణంగా ఐదేళ్ల ఆలస్యం
- చివరిసారిగా 2011లో జనాభా లెక్కింపు



యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

- యూసీసీ అమలు చేస్తాం
- 30 ఏళ్ల వరకు ఎస్పీకి అధికారం లేదు
- రామభక్తులపై కాల్పులను గుర్తుచేసిన షా
- ఓటు చోరీపై చర్చకు సిద్ధం
- యూసీసీపై దేశవ్యాప్త చర్చ

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ దేశాయ్ నియామకం
- ఇరుపక్షాల అంగీకారంతో నిర్ణయం
- పరిష్కారానికి నిపుణుల సహకారం
- మధ్యవర్తిత్వానికి పూర్తి సహకారం
- నాలుగు వారాల తర్వాత సమీక్ష
- విచారణ నిలిపివేతకు గతంలో నిరాకరణ

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

- 36,351 మందితో బందోబస్తు
- 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

అమరావతి

నవంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని - మిగతా2లో

తుపాను బాధితుల కష్టం తెలుసు..
ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- సీఎం చంద్రబాబు భరోసా
- పశ్చిమగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల

అమరావతి

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను - మిగతా2లో

తుపాను బాధితుల కష్టం తెలుసు..
ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.

పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. “ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది” అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. “రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తొలుత గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం” అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు భరోసా.. మత్స్యకారులకు హామీ

అనంతరం మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, “ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా” అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన, సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

రూ.4,600 కోట్ల నష్టం.. కేంద్ర బృందం పర్యటన

షెల్టర్ సందర్శన అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. ‘అర్నబ్’ తుపాను ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించానని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయని అన్నారు.

“రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశాం. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగాం. అయినప్పటికీ, దురదృష్టవశాత్తూ ఏడుగురు మరణించడం బాధాకరం” అని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామని తెలిపారు. తుపాను వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ మేరకు కేంద్రానికి నివేదిక పంపామని చెప్పారు. పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని, నష్ట తీవ్రతను పరిశీలించేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని వెల్లడించారు.

బాధితులకు నిత్యావసరాలు, రైతులకు నిధులు

తుపాను కష్టకాలంలోనూ రైతులకు అండగా నిలుస్తూ, పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశామని సీఎం ప్రకటించారు. తుపాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సహాయక శిబిరాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని, తుపాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం బాధితులకు ఆయన స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ఏలూరు మేయర్ పీఠం కోసం హోరాహోరీ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కోసం హోరాహోరీ సమరం నడుస్తోంది. కూటమి పొత్తు ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన ఈ మేయర్ స్థానానికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంటా మోహన్ రావు ప్రత్యర్థిగా తలపడుతున్నారు.కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికి స్థానిక రాజకీయాల్లో దశాబ్దాల క్షేత్రస్థాయి అనుభవం అతిపెద్ద బలం. గతంలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉండి, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఆయనకుంది. 2019 నుంచి ఏలూరు జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ పార్టీ కేడర్‌ను నిర్మించడంతో పాటు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా కార్మిక, ప్రజా సంఘాలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చరిష్మా, టీడీపీ-జనసేన సంప్రదాయ కాపు, బీసీ, బలిజ ఓటు బ్యాంకు ఒక్కతాటిపైకి రావడం ఆయనకు కొండంత అడ్వాంటేజ్. అయితే, ఏలూరు మేయర్ సీటు తమకే కావాలంటూ ప్రారంభంలో స్థానిక టీడీపీ కేడర్, ఆశావహులు వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యే బడేటి చంటి వర్గంతో సమన్వయం సాధించడంలో తొలుత ఎదురైన అంతర్గత అసంతృప్తి అప్పలనాయుడికి కొంత ప్రతిబంధకంగా మారాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి గంటా మోహన్ రావు కూడా నగరంలో బలమైన ఆర్థిక, సామాజిక వనరులున్న నాయకుడిగా బరిలోకి దిగారు. నగరంలోని బీసీ వర్గాలతో పాటు, సంప్రదాయంగా వైసీపీ వెన్నంటి నిలిచే మైనార్టీ, ఎస్సీ , కొన్ని కార్మిక వాడల ఓటు బ్యాంకుపై ఆయన ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలైన సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుస్తూ, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రచారం చేస్తూ కేడర్‌ను మోహరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, గత మున్సిపల్ పాలకవర్గంపై ఏలూరు ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, గతంలో నగరంలో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురైన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ నగరవాసుల మదిలో ఉండటం వైసీపీకి అతిపెద్ద మైనస్. అదీగాక, ఓటమి భయంతో నగరానికి చెందిన మాజీ మంత్రులు, కీలక వైసీపీ నేతలు ప్రచారానికి మొహం చాటేయడం, ఆయనకు పూర్తిస్థాయి అంగబలం కరువవ్వడం ప్రధాన బలహీనతగా మారింది. ఈ ఎన్నికల్లో డివిజన్ల స్థాయిలో కార్పొరేటర్ అభ్యర్థుల బలం మేయర్ పోరును ప్రత్యక్షంగా శాసిస్తోంది. నగరంలోని 62 డివిజన్లలో దాదాపు అన్ని చోట్లా కూటమి శ్రేణులు ముందస్తుగా సమన్వయ

కమిటీలు వేసుకుని, బూత్ లెవల్ ప్రచారంలో స్పష్టమైన పైచేయి సాధించాయి. గతంలో తమ మధ్య ఉన్న అసంతృప్తులను పక్కనబెట్టి.. టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జనసేన నేతలు ఏకతాటిపైకి వచ్చి అప్పలనాయుడి తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు, వైసీపీకి చాలా డివిజన్లలో సమర్థులైన కార్పొరేటర్ అభ్యర్థులే దొరక్కపోవడం, బరిలో ఉన్నవారు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చతికిలపడటం మేయర్ అభ్యర్థి గంటా మోహన్ రావుకు క్షేత్రస్థాయిలో గొడ్డలిపెట్టుగా మారింది. సామాజిక సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న బీసీ, కాపు, వైశ్య, ఉద్యోగ వర్గాలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా, పెన్షన్ల పెంపు, దీపం-2’ వంటి సంక్షేమ పథకాల వైపే స్పష్టంగా మొగ్గుచూపుతున్నాయి. అప్పలనాయుడికున్న క్లీన్ ఇమేజ్, స్థానిక నాయకత్వ పట్టు ఆయనకు సాధారణ తటస్థ ఓటర్లలోనూ ఆదరణ తెచ్చిపెడుతోంది. వైసీపీ కేవలం తమ పాత సంప్రదాయ ఓట్లను మాత్రమే నిలుపుకోగలుగుతుండగా, కొత్తగా ఓటర్లను ఆకర్షించే అంశాలేవీ ఆ పార్టీ వద్ద లేకపోవడం ప్రచారంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.మేయర్ ప్రత్యక్ష పోరులో కూటమి-జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికే దాదాపు 65 నుంచి 70 శాతం మేర స్పష్టమైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కేటాయింపు సమయంలో తలెత్తిన విభేదాలను అధిగమించి కూటమి శ్రేణులు ఏకతాటిపైకి రావడం ఆయనకు అతిపెద్ద రక్షాకవచంగా మారింది. దీంతో గంటా మోహన్ రావు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుని, అక్కడ జనసేన జెండా ఎగరడం దాదాపు లాంఛనమేనని అనుకోవచ్చు.

నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు

-మొదటిపేజీ తరువాయి

ప్రక్రియకు జులై ఒకటి అర్హత తేదీగా పరిగణిస్తూ, డ్రాఫ్టు ఓటర్ల జాబితా జులై 31న ప్రకటించామన్నారు. అక్టోబర్ 22 వరకు క్లెయిమ్?లు, అభ్యంతరాలను స్వీకరించి 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తొలుత నిర్ణయించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులతో నవంబర్ 20 వరకు క్లెయిమ్‌లను, అభ్యంతరాలు తీసుకోనున్నట్టు వివరించారు. నవంబర్ 30న సర్ పూర్తయ్యాక ఓటర్ల జాబితాలను వెల్లడిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు.

6 రాష్ట్రాల్లో సవరణ

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో పారదర్శకత పెంచడం, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, డూప్లికేట్ ఓట్లను గుర్తించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టింది. ఇప్పటికే బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళం, ఉత్తర్?ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగిసింది ప్రస్తుతం మూడో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో ఈ ఏడాది మే 14న సర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ దశ పూర్తయితే జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, లద్ధాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ పూర్తైనట్లు అవుతుంది.

ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థనల మేరకు గడువు పొడిగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో నవంబరు 30న తుది జాబితా ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దిల్లీలో మాత్రం డిసెంబరు 12 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఓటర్ల తుది జాబితాను డిసెంబరు 22న విడుదల చేయనున్నారు. ఈ దశ పూర్తయితే జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుంది.

మత్స్యకారుల సమస్యలపై చర్చ

-మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేయాలి. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుంది. ఉప్పాడ తీరప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా అధ్యయనం చేస్తా.” కాకినాడను అతలాకుతలం చేసిన అర్నబ్ : అర్నబ్ తుపాను కాకినాడ నగరాన్ని అతలాకుతలం చేసింది. తుపాను ప్రభావంతో వీచిన భారీ ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావం తగ్గి మూడు రోజులు గడుస్తున్నా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ కాలేదు. మూడు రోజులుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో అలల తాకిడికి తీరం కోతకు గురైంది. ఇటీవల ఎత్తుగా నిర్మించిన రాళ్లగట్టును సైతం అలలు దాటుకుని విరుచుకుపడ్డాయి. ఉప్పాడ సమీపంలోని కొత్తపట్నం, కొత్తపేట, పల్లిలపేట, సుబ్బంపేట, రంగంపేటతో పాటు ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు చాలా ప్రదేశాల్లో పూర్తిగా దెబ్బతింది. రాకపోకలు స్తంభించిపోయాయి.

54,435 హెక్టార్లలో పంటలు నష్టం

మరోవైపు అర్నబ్ తుపాన్ రైతన్నల ఆశలను గల్లంతు చేసింది. కాకినాడ జిల్లాలో కురిసిన వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా జిల్లాలో 54,435 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పంటలకు సంబంధించి 4,183 హెక్టార్లలో వరి, 720 హెక్టార్లలో మినుము, అయిదు హెక్టార్లలో పత్తి, రెండు హెక్టార్లలో పెసర పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 21 మండలాల పరిధిలోని వ్యవసాయ పంట నష్టాల అంచనాపై గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొన్నిచోట్ల పంట పూర్తిగా నీటమునగగా, మరికొన్ని ఈదురుగాలుల వల్ల పడిపోయినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

-మొదటిపేజీ తరువాయి

ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరింది.

12,244 కేంద్రాల్లో 1న పోలింగ్

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభవుతుంది. 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. వీటిని ఈనెల 31న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్? వేసిన అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరంగా చేస్తున్నారు. చాలా చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ చతికిలబడిందని రాజకీయ నిపుణులు వెల్లడిస్తున్నారు.

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

రాజమండ్రి : వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ద్రవ్యోల్బణ భారాన్ని సామాన్యులపై పడకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే దీపావళి పండుగ నుంచే రాష్ట్రంలోని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే సగానికి పైగా తక్కువ రేటుకే అందుబాటులోకి తేవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

దాడి నాగ అప్పారావు ప్రచారానికి విశేష స్పందన.

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 30: మండలం లోని గాంధీ గ్రామం ఎంపీటీసీగా కూటమి పార్టీ నుండి పోటీ చేస్తున్న దాడి నాగ అప్పారావు ప్రచారానికి విశేష స్పందన లభిస్తుంది. అతని భార్య దాడి వెంకట పద్మ ఎంపీటీసీగా పోటీలో ఉండడంతో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని చోడవరం మండలం గాంధీ గ్రామం పంచాయతీ పరిధిలో ఓటర్లను కోరుతున్నారు. ఎంపీటీసీగా తనకు అవకాశం ఇస్తే గ్రామం లోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. అంతే కాకుండా మండలం నుండి నిధులు రప్పించి పలు సమస్యలు పరిష్కరిస్తామని నాగ అప్పారావు ఓటర్లకు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున తనను గెలిపిస్తే నిధులు ఎక్కువగా రప్పించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

బిజెపి ఎంపిటిసి అభ్యర్థి కందర్ప రమణ మూర్తి కి విశేష ఆదరణ.

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 30: స్థానిక ఎన్నికల్లో చోడవరం ఎంపిటిసి సెగ్మెంట్ 4 అభ్యర్థిగా బిజెపి నుండి పోటీ చేస్తున్న కందర్ప రమణ మూర్తి (కందర్ప వెంకట నరసింహమూర్తి)కి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి సీనియర్ నాయకులు కందర్ప రమణ మూర్తి ద్వారకానగర్, బాలాజీ నగర్, కోపరేటివ్ కాలనీ, బానయ్య కోనేరు, రెల్లి వీధి, ప్రేమ సమాజం ప్రాంతాలు తిరిగి ఎంపీటీసీ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి తనను దీవించాలని కోరారు. ఆయన ప్రచారానికి విశేష స్పందన లభించింది. కూటమి పార్టీలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, అతని అభిమానులుతో భారీగా ప్రచారానికి వెళ్లి తనను గెలిపిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున నిధులు రప్పించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

స్వతంత్ర అభ్యర్థిగా వైసిపి నాయకురాలు అల్లాడ భవాని

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 30: స్థానిక ఎన్నికల్లో చోడవరం ఎంపీటీసీ సిగ్మెంట్ 4 అభ్యర్థిగా వైసిపి మహిళా నాయకురాలు అల్లాడ భవాని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమె గతంలో ఒకసారి ఎంపీటీసీగా, మరొకసారి పంచాయతీ వార్డు మెంబర్ గా నామినేషన్ వేసి పార్టీ నాయకులు కోరడంతో పోటీ నుండి తప్పుకున్నారు. ఈ సారి ఎంపీటీసీ 4 సెగ్మెంట్ నుండి పోటీకి సిద్ధమయ్యారు. ఈమె స్వతంత్ర అభ్యర్థి కావడంతో బాటిల్ గుర్తు వచ్చింది. బోళ్ల వీధి, బుక్క వీధి, నౌడు వీధి, వెలమ వీధిలో కొంత భాగం, షావుకారుల వీధిలో కొంత భాగం ఎంపీటీసీ సెగ్మెంట్ 4 పరిధిలో ఉంటాయి. ప్రచారం ప్రారంభించి పోటీకి సిద్ధమని అంటున్నారు.

ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..
  సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- జిల్లా సతీష్ కుమార్, ఐపీఎస్

ధర్మవరం,అక్టోబర్ 30 (పెన్ సత్తా) ధర్మవరం మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించడమే లక్ష్యంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. నవంబర్ 1వ తేదీన ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల భద్రతా విధుల కోసం సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ వివరించారు.పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా వర్గీకరించి,ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.సివిల్ పోలీసులతో పాటు ఏఆర్,స్పెషల్ పార్టీలు,ఏపీఎస్పీ బలగాలను మోహరించినట్లు పేర్కొన్నారు.

నిరంతర నిఘా.. పటిష్టమైన భద్రత

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బృందాలు, రూట్ మొబైల్స్‌తో పాటు 61 స్ట్రైకింగ్ ఫోర్సుల ద్వారా నిరంతర గస్తీ, పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను కూడా సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సంబంధిత ఆంక్షలను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలను మోహరించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అక్రమ నగదు,మద్యం రవాణాపై నిఘా

బయటి వ్యక్తుల అక్రమ ప్రవేశాన్ని అరికట్టడంతో పాటు నగదు,మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.పోలింగ్ కేంద్రాలు,పరిసర ప్రాంతాలపై సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ఘర్షణలు లేదా అల్లర్లకు పాల్పడడం వంటి చర్యలను సహించబోమని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజలు,ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఎన్నికల అక్రమాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు ఏవైనా దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి 25 కుటుంబాల చేరిక

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

ధర్మవరం,అక్టోబర్ 30 (పెన్ సత్తా) ధర్మవరం పట్టణంలోని 39వ వార్డులో బీజేపీ, టీడీపీలకు చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ,వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ధర్మవరం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు.ఆ సమయంలో జరిగిన అభివృద్ధిని గుర్తించి 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు.పార్టీలో చేరిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని పాడు చేశారు.

- అధ్వానంగా చోడవరం రోడ్లు.
- ప్రచారంలో దూసుకుపోతున్న జడ్పిటిసి వైసిపి అభ్యర్థి డి.వి.ఆర్

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 30: స్థానిక ఎన్నికల్లో చోడవరం జడ్పిటిసి అభ్యర్థిగా నర్సాపురం గ్రామానికి చెందిన దొడ్డి వెంకటరావు (డి.వి.ఆర్) ప్రచారంలో దూసుకుపోతున్నారు. చోడవరం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి డివిఆర్ మండలంలోని అడ్డూరు, రాయపురాజుపేట, సీమనాపల్లి, జుత్తాడ, సింహాద్రిపురం, ముద్దుర్తి, దుడ్డుపాలెం, నరసాపురం తదితర గ్రామాలు తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరుతున్నారు. జడ్పిటిసి ఓటు ఫ్యాను గుర్తుకు వేసి తనను, ఎంపీటీసీ ఓటు కూడా ఫ్యాన్ గుర్తుకు వేసి ఆ ప్రాంత ఎంపీటీసీని కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జెడ్పిటిసి అభ్యర్థి దొడ్డి వెంకటరావు (డి.వి.ఆర్) మాట్లాడుతూ.... వైసిపి హయాంలో చోడవరం చక్కెర కర్మాగారానికి రూ 89 కోట్లు నిధులు మంజూరు చేసి ఆదుకోగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక రూపాయి కూడా ఇవ్వలేదని, రైతులకు చెరుకు బకాయిలు చెల్లించలేదని, వందలాది కార్మికులు రోడ్డున పడ్డారని విమర్శించారు. హుద్ హుద్ తుఫాన్ సమయంలో ఫ్యాక్టరీలో భారీగా అవినీతి జరిగిందని అప్పటి నుండి నష్టాల బాటలో నడిచిందని అన్నారు. ప్రజలకు మంచి సేవ చేయాలని సంకల్పంతో ముందుకు వచ్చారని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి దీవించాలని కోరారు. ఈ ప్రచారంలో భారీగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ అభ్యర్థి గూనూరు ఎర్ర అప్పల నాయుడు కు ప్రజలు నీరాజనాలు.

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్30: చోడవరం ఎంపీటీసీ 1 సిగ్మెంట్ కూటమి అభ్యర్థి గూనూరు ఎర్ర అప్పల నాయుడు కు ఆ ప్రాంత ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. ఆయన కూటమి నాయకులు, అభిమానులతో సకరు వీధి, తామర చెరువు వీధి, లక్ష్మీదేవి పేట తదితర ప్రాంతాలు ప్రచారం చేయగా కొందరు మహిళలు కొందరు అతనికి హారతులు ఇచ్చారు. భారీగా జనాలతో ఎంపీటీసీ అభ్యర్థి ప్రచారం చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.?

వాకర్స్ క్లబ్ వద్ద రెడ్డి పల్లి ప్రచారం.

చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 30: స్థానిక లక్ష్మీపురం రోడ్డులో ఉన్న వాకర్స్ క్లబ్ వద్ద ఎంపీటీసీ అభ్యర్థి రెడ్డిపల్లి మంగ అప్పలరాజు ప్రచారం చేశారు. ఎంపిటిసి 4 సెగ్మెంట్ కు పోటీ చేస్తున్నామని కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని క్లబ్ అధ్యక్షులు ఓరిగంటి రాంబాబు, రిటైర్డ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి రాజశేఖర్, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు టివి రమణ తదితరులను రెడ్డిపల్లి కోరారు.

104 వ వార్డు సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం బేరి అశోక్ కుమార్ రెడ్డి.

పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 30:గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 104 వ వార్డు సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్వతంత్ర కార్పొరేటర్ అభ్యర్థి బేరి అశోక్ కుమార్ రెడ్డి (ఎం.టెక్) తెలిపారు. తన ఎన్నికల ప్రచార ప్రకటనలో భాగంగా వార్డు ప్రజలకు ఆయన పలు హామీలు ఇచ్చారు, భూమి హక్కులు, తరతరాలుగా నివసిస్తున్న ప్రతి అర్హ కుటుంబానికి చట్ట బద్ధంగా భూమి పట్టాలు అందేలా కృషి చేస్తానన్నారు.యాష్ పాండ్ కాలుష్య నివారణ, ఎన్ టీ పి సి యాష్ పాండ్ ధూళి నుంచి ప్రజలను రక్షించేందుకు గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలకు ప్రతి నెలా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధి అవకాశాలు, పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించి, మధ్యవర్తుల దోపిడీని అరికట్టి కార్మికులకు న్యాయ మైన వేతనాలు అందేలా పోరాడతానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు ఉచిత రవాణా, గాజువాక, కూర్మన్నపాలెం, పరవాడ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు (ముఖ్యంగా విద్యార్థినులకు) ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. పర్యాటక అభివృద్ధి, అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి, అప్పికొండ బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది స్థానికులకు వ్యాపార అవకాశాలు పెంచుతానన్నారు.మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం సరిదిద్దడంతో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రజల తరపున నిరంతరం ప్రశ్నిస్తూ, అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధిగా ఉంటానని స్పష్టం చేస్తూ, 'ఉంగరం' గుర్తు పై ఓటు వేసి తనను గెలిపించాలని 104 వ వార్డు ప్రజలను కోరారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

35వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోటిరెడ్డి బాలిరెడ్డి

ధర్మవరం,అక్టోబర్ 30 (పెన్ సత్తా)పట్టణంలో గతంలో చేపట్టిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ధర్మవరం మున్సిపాలిటీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోటిరెడ్డి బాలిరెడ్డి ప్రజలను కోరారు.వార్డులోని సమస్యలను పరిష్కరించడంతో పాటు మరింత అభివృద్ధి సాధించేందుకు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 35వ వార్డులో ఆయన ఇంటింటా పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని,వారితో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా కోటిరెడ్డి బాలిరెడ్డి మాట్లాడుతూ, గతంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 35వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం కల్పిస్తే వార్డులోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. తనను వార్డు ప్రజలు తమ ఇంటి బిడ్డగా భావించి ఆదరించాలని కోరారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కాచర్ల ఆంజనేయులును కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

40వ వార్డులో పండుగ వాతావరణంలో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ ప్రచారం

ఆదినారాయణకు మహిళల బ్రహ్మరథం.. అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన

ధర్మవరం,అక్టోబర్ 30 (పెన్ సత్తా)శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ (కొత్తపేట ఆది) ఎన్నికల ప్రచారం పండుగ వాతావరణంలో కొనసాగింది. ఆదినారాయణను అఖండ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొని, ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు.ఆదినారాయణ ప్రచారానికి వెళ్లిన ప్రతి ఇంటి వద్ద మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానికులు తమ ఇంటి వ్యక్తిలా ఆప్యాయంగా ఆదరించి,ప్రచారానికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ఓటర్లు ఆదినారాయణకు ఓటు వేసి గెలిపిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచార వర్గాలు తెలిపాయి. మహిళల ఉత్సాహం, ప్రజల ఆదరణతో 40వ వార్డులో ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది.

శాంతియుత ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు

ధర్మవరంలో ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ధర్మవరం,అక్టోబర్ 30 (పెన్ సత్తా)మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ధర్మవరం పట్టణంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఐపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులకు సంబంధించి 134 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిలో సుమారు 11 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పట్టణంలో ఎన్నికల భద్రతలో భాగంగా అమలులో ఉన్న ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు సూచించారు. అనుమతి లేని గుమికూడింపులు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీషీటర్లు,గతంలో అల్లర్లకు పాల్పడినవారు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట చట్టప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టడంతో పాటు,సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా,గొడవలు సృష్టించినా,ఓటర్లను బెదిరించినా లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైతే అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని స్పష్టం చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటిస్తూ, క్యూలైన్లలో నిలబడి ఓటు వేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నల్లకాల్వలో టీడీపీ గూండాల బరితెగింపు.. సాక్షి విలేకరిపై హత్యాయత్నం!

- కర్రలతో విరుచుకుపడిన టీడీపీ మూకలు.. సాక్షి విలేకరి ఇంటిపై మూకుమ్మడి దాడి!
- జర్నలిస్టుకే రక్షణ లేదా? సాక్షి విలేకరిని హతమార్చేందుకు యత్నం!
- గ్రామస్తులు పెద్దఎత్తున రావడంతో పరారైన దుండగులు
- పారిపోతున్న క్రమంలో పట్టుబడిన ఒక వ్యక్తిని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- దాడికి ముందురోజే డీఎస్పీ సమాచారం ఇచ్చారు
- ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని పోలీసులు ఉచిత సలహా
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రోద్బలంతోనే దాడి జరిగిందని బాధితుడి ఆరోపణ
- దాడులకు భయపడేది లేదు.. మరింత పట్టుదలతో జర్నలిస్టుగా పనిచేస్తా: సుబ్బారెడ్డి

నంద్యాల జిల్లా:(పెన్ సత్తా) నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం నల్లకాల్వలో సాక్షి దినపత్రిక విలేకరి ఎన్.వి. సుబ్బారెడ్డిపై టీడీపీ దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయన ఇంటిపైకి ఇన్నోవా కారులో వచ్చిన దుండగులు కర్రలతో దాడికి తెగబడ్డారు. ఇంట్లోకి చొరబడి ప్రాణాలు తీసేలా దాడి చేసేందుకు ప్రయత్నించగా, గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో నిందితులు పరారయ్యారు. పారిపోతున్న వారిలో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ దాడి వెనుక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రోద్బలం ఉందని బాధితుడు ఆరోపించారు.

మీడియాతో సాక్షి విలేకరి సుబ్బారెడ్డి ఏమన్నారంటే..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బెదిరింపులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు పోటీ చేయాలని నిర్ణయించినప్పటి నుంచి ఆత్మకూరు మండలంలో ముఖ్యమైన నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు, బెదిరింపులు జరుగుతున్నాయి. నేను సాక్షి దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్నాను. ప్రజా సమస్యలపై వార్తలు రాయడంతో పాటు రాజకీయ పరిణామాలను కూడా ప్రజలకు తెలియజేస్తున్నాను. ఈ క్రమంలో నన్ను ప్రచారానికి దూరంగా ఉండాలని, ఎవరికి ఓట్లు వేయమని చెప్పకూడదని కొందరు బెదిరిస్తున్నారు. నా బంధువుల ద్వారా కూడా ప్రచారం మానుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఒత్తిడి తెస్తున్నారు.

దాడి జరిగే అవకాశం ఉందని ముందే హెచ్చరించిన పోలీసులు

దాడికి ముందు రోజు ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు నన్ను పిలిపించి, నీపై దాడి జరిగే అవకాశం ఉంది.. జాగ్రత్తగా ఉండు అని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారం చేయకుండా ప్రశాంతంగా విలేకరి పని చేసుకోవాలని సూచించారు. దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందే సమాచారం ఉన్నప్పుడు నా రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? మరుసటి రోజు ఉదయం నేను ఇంటి వద్ద ఉండగా ఇన్నోవా కారులో వచ్చిన నలుగురు నుంచి ఆరుగురు వ్యక్తులు కర్రలతో దాడికి దిగారు. వారి నుంచి తప్పించుకునేందుకు ఇంట్లోకి వెళ్లి గేటు వేసుకున్నాను. గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. పారిపోతున్న వారిలో ఒకరు తప్పించుకోలేకపోవడంతో గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో ఇన్నోవా కారు అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే దాడి.. భయపడేది లేదు

టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని నేను భావిస్తున్నాను. గత కొన్ని రోజులుగా ఆయనకు సంబంధించిన వ్యక్తుల ద్వారా ప్రచారం మానుకోవాలని బెదిరింపులు వస్తున్నాయి. నల్లకాల్వలో ఎన్నికల ప్రచారం సమయంలో కూడా మా కార్యక్రమాలు, ప్రజల స్పందన ఆయనకు నచ్చలేదు. దాడులు, బెదిరింపులతో మమ్మల్ని భయపెట్టవచ్చని అనుకుంటున్నారు. నా ప్రాణానికి ఏదైనా హాని జరిగితే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిదే బాధ్యత. ఇలాంటి దాడులు నన్ను వెనక్కి తగ్గించలేవు. సాక్షి విలేకరిగా నా బాధ్యతను మరింత పట్టుదలతో నిర్వర్తిస్తాను అని ఎన్.వి. సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేతిలో ఎస్ఈసీ కీలుబొమ్మ

(పెన్ సత్తా)విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వైయస్ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అక్కడే మీడియాతో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, వైయస్ఆర్‌సీపీ ఇచ్చిన ఫిర్యాదులపై ఎస్ఈసీ స్పందించాల్సిన తీరును వివరించారు.

విజయవాడ:

రాష్ట్రంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) పని చేస్తోందని, టీడీపీ కార్యాలయానికి అనుబంధ విభాగంలా కమిషన్ ?యవహరిస్తోందని వైయస్ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవస్థలు పని చేస్తున్నాయని, ఎన్నికల నిబంధనల అమలులో పక్షపాత ధోరణి కనిపిస్తోందని వారు స్పష్టం చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతను విస్మరిస్తోందని ఆక్షేపించారు. వందలాది ఫిర్యాదులు, ఆధారాలు సమర్పించినా స్పందన లేకపోవడం ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని తెలిపారు.

ఈ అంశాలన్నింటిపై విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వైయస్ఆర్‌సీపీ నాయకులు, అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

మీడియాతో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే..:

ఎన్నికల సంఘం బాధ్యత విస్మరించింది: లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

ఎన్నికల పోలింగ్‌కు రెండు రోజుల ముందు కూడా వందలాది ఫిర్యాదులు, వీడియోలు, ఆడియో ఆధారాలు సమర్పించినా ఎస్ఈసీ కనీసం విచారణ చేపట్టలేదు. 150 మంది పోలీసు అధికారులపై రెండుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. పోలీసు, రెవెన్యూ అధికారులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ నామినేషన్ పత్రాలు, పోలింగ్ ఏజెంట్ ఫారాలు చించేస్తున్నా పట్టించుకోవడం లేదు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి బ్రాంచ్ ఆఫీస్‌గా ఎస్ఈసీ మారిపోయింది.

పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలపై నిర్లక్ష్యం

రాష్ట్రంలో 12,224 పోలింగ్ కేంద్రాలకు కేవలం 36,351 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల్లో 60 వేల నుంచి 70 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తే, ఇప్పుడు సగానికి తగ్గించడం వెనుక ఉద్దేశం ఏమిటి? బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లు, రిగ్గింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారా? ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని న్యాయస్థానాలు చెప్పినా అమలు చేయడం లేదు. 12 వేలకుపైగా బూత్‌లలో 7 వేలకైనా ఈ సదుపాయాలు ఉన్నాయో లేదో స్పష్టత లేదు. సమస్యాత్మక కేంద్రాల జాబితాను కూడా వెల్లడించడం లేదు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు

కడప, పులివెందుల, కర్నూలులోని కొన్ని వార్డుల్లో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం లేదు. డబ్బులు పంచుతూ, పెన్షన్లు తొలగిస్తామని బెదిరిస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. మాచర్లలో తల్లి మృతదేహాన్ని చూసేందుకు కూడా ఒక వ్యక్తిని అనుమతించని పరిస్థితి ఉంది. నెల్లూరు, గూడూరులో పోలీసు అధికారుల ప్రమేయంతో అభ్యర్థులను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందించని ఎస్ఈసీపై అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగుతుంది. ఓటు అనే ఆయుధంతో ప్రజలు తమ తీర్పును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

రాయలసీమ, పల్నాడులో ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఎన్నికలు: ఎం. మనోహర్‌రెడ్డి, వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో ఏకగ్రీవాల కోసం టీడీపీ నేతలు పోలీసుల సహకారంతో బెదిరింపులు, దాడులు, అక్రమ అరెస్టులు, కేసులకు పాల్పడ్డారు. పోటీ నుంచి తప్పుకోకపోతే గంజాయి కేసులు పెడతామని, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కేసులు లేని వారిని సైతం బైండోవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి, వైయస్ఆర్‌సీపీకి మద్దతుగా నిలిస్తే ఇబ్బందులు తప్పవని భయపెడుతున్నారు. గతంలో పులివెందల, ఒంటిమిట్ట ఎన్నికల్లో ఇతర ప్రాంతాల నుంచి గుండాలను తీసుకొచ్చి ఓటర్లను అడ్డుకున్నట్లుగానే, రేపటి పోలింగ్‌లోనూ తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పులివెందలలోని పోలింగ్ కేంద్రాలను ఆక్రమించే కుట్ర జరుగుతోందన్న సమాచారం మాకు ఉంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాం. ప్రశాంతమైన ఎన్నికలు, పౌరుల స్వేచ్ఛాయుత ఓటు హక్కు కోసం న్యాయపోరాటం కొనసాగిస్తాం. ప్రజాస్వామ్యవాదులంతా ఈ అరాచకాలను అడ్డుకుని, నిష్పక్షపాత ఎన్నికలకు సహకరించాలని మనోహర్‌రెడ్డి కోరారు.

150 ఫిర్యాదులిచ్చినా చర్యలు లేవు.. ఓటర్లకు రక్షణ కల్పించాలి:

నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

గత 15 రోజులుగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి రోజుకు సగటున పది చొప్పున దాదాపు 150 వినతిపత్రాలు సమర్పించాం. అయినా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదు. ఒంగోలు, కర్నూలు తదితర ప్రాంతాల్లో వైయస్ఆర్‌సీపీ పోలింగ్ ఏజెంట్ల ఫారాలను రిటర్నింగ్ అధికారుల ఎదుటే టీడీపీ గుండాలు చించేస్తున్నా పోలీసులు, అధికారులు చూస్తూ ఉండిపోతున్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా, నిబంధనల ప్రకారం పనిచేసిన సీఐ సుధాకర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ఏంటి? పోలింగ్‌కు పోలీసు బందోబస్తును గతంతో పోలిస్తే సగానికి తగ్గించి, ఒక్కో బూత్‌కు ఇద్దరు పోలీసులనే ఏర్పాటు చేయడం ఆందోళనకరం.

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్త్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్ష సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రెండు నిమిషాల్లోనే తెగిన సంబంధాలు

చమోలీ ఎస్పీ సుర్జీత్ సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణా) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది.

సంస్థ సేవలు నిలిపివేత

ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

యూపీ నుంచి బెంగాల్ వరకు పేదరికంభారతదేశంలో తీవ్ర పేదరికం 12 ఏళ్ల కాలంలో అత్యంత వేగంగా క్షీణించిందని వరల్డ్ బ్యాంక్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2011 సంవత్సరంలో ఏకంగా దేశ జనాభాలో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు, 2023 నాటికి 2.6 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. ఈ కాలంలో భారతదేశం సుమారు 496 మిలియన్ల మంది ప్రజలను (49.6 కోట్లు) విజయవంతంగా పేదరికం నుంచి బయటపడేసిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 'ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్: అక్టోబర్ 2026' పేరిట విడుదలైన ఈ రిపోర్ట్ ప్రకారం- ఈ పేదరికం అంచనాలను 2021 కొనుగోలు- శక్తి- సమతుల్యత (ప్రూా- పర్చేజింగ్, పవర్, పారిటీ) ఆధారంగా లెక్కించారు. వరల్డ్ బ్యాంక్ ఈ నివేదికలో పేదరికాన్ని అంచనా వేయడానికి రోజుకు 4.20 డాలర్ల ఆదాయాన్ని దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక పరిమితిగా, రోజుకు 3 అమెరికన్ డాలర్లను తీవ్ర పేదరిక ప్రమాణంగా తీసుకొని ఈ గణాంకాలను వెల్లడించింది.

2011-2023 మధ్య కాలంలో రోజుకు 4.20 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా వాటా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. ఈ మార్పుతో సుమారు 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. అదే సమయంలో రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే తీవ్ర పేదరికం రేటు- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గించిన దేశాల్లో భారత్ కూడా ఒకటని వరల్డ్ బ్యాంక్ అభిప్రాయపడింది. గత దశాబ్ద కాలంలో భారత్- పేదరికాన్ని తగ్గించడంలో అద్భుతమైన పురోగతిని సాధించిందని పేర్కొంది. పేదరికం తగ్గినా ఆదాయ అసమానతలు మాత్రం కొనసాగుతున్నట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఇక్కడ ఎక్కువగా సంపాదించే వారు, తక్కువగా సంపాదించే వారి ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం ఉందని స్పష్టం చేసింది.

పేదరికం తగ్గడానికి కారణాలివే!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్‌పై ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశంలో పేదరికం తగ్గడానికి కారణాల్ని కూడా వరల్డ్ బ్యాంక్ ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. వినియోగ వ్యయం పెరగడం, మెరుగైన ఉపాధి అవకాశాలు ముఖ్యంగా మహిళలకు ఉద్యోగ అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీలతో పాటు ఇతర సామాజిక సంక్షేమ పథకాలు విస్తరించడం వంటివి పేదరికం తగ్గడానికి దోహదపడ్డాయని ప్రపంచ బ్యాంక్ గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన నిర్ణయాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కారణంగానే ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని, తీర్పును గెల్చుకుంటోందని ఆమె అన్నారు. ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం, కుటుంబ ఆదాయాల్ని బలోపేతం చేయడం, ప్రజా సేవల పంపిణీ ద్వారా పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. రాబోయే సంవత్సరాల్లోనూ భారతదేశంలో పేదరికం తగ్గే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. రోజుకు 4.20 డాలర్ల ఆదాయ పరిమితి ప్రకారం 2026లో పేదరికం రేటు 14.2 శాతం నుంచి, 2028 నాటికి 12.1 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. అయితే ఇది ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా రూపొందించిన ప్రాథమిక అంచనాలేనని, ఉపాధి, ఆర్థిక గణాంకాల్లో మార్పులు వచ్చినప్పుడు దానికి అనుగుణంగా ఇది మారొచ్చని తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి అయినా!

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవన ప్రమాణాలు ఇటీవలి కాలంలో మెరుగుపడ్డాయని ప్రపంచ బ్యాంక్ నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేగంగా తగ్గడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికీ పేద కుటుంబాల్లో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారని నివేదిక తెలిపింది. ప్రధానంగా అక్కడ ఉత్పాదకత తక్కువగా ఉండటం, వ్యవసాయం కాకుండా ఇతర మెరుగైన ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యలు అని వివరించింది. దేశంలో పేద జనాభాలో దాదాపు 57 శాతం మంది ఉత్తర్ ప్రదేశ్ నుంచి బెంగాల్ వరకు విస్తరించిన రాష్ట్రాల్లోనే ఉన్నారని రిపోర్ట్ తెలిపింది. దేశవ్యాప్తంగా పేదరికాన్ని మరింత తగ్గించాలంటే ఈ రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం కీలకం అని సూచించింది.

యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.



మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!

ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీ లో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్?వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్ 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను (సమాజ్‌వాదీ పార్టీ) వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.

ఓటు చోరీపై ఏమన్నారంటే?

మరోవైపు విపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై కూడా అమిత్ షా మండిపడ్డారు. వారిని మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అంపైర్?ను నిందించే జట్టుతో పోల్చారు. "మ్యాచ్ ఓడిపోయిన తర్వాత, వాళ్లు అంపైర్‌ను నిందిస్తున్నారు. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తున్నారు. పార్లమెంట్?లో ఈ అంశంపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉంది. ఈ రోజే వచ్చి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోనివ్వండి. మేము ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సిద్ధంగాఉన్నాం. పార్లమెంట్‌లో చర్చ జరగనివ్వండి" అని అన్నారు.

కాగా, ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని డాక్టర్ రామ్? మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించారు. తమ పార్టీ సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్? మౌర్య, బ్రజేశ్ పాఠక్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కూడా యూసీసీ అమలు గురించి మాట్లాడడం గమనార్హం. ఇటీవల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేయాలని పిలుపునిచ్చారు. యూసీసీ లేకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్న వారిలో ముస్లిం మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. బహుభార్యత్వం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసోంలో ఇప్పటికే యూసీసీని నోటిఫై చేశామని ఆయన గుర్తు చేశారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కూడా యూసీసీ ప్రస్తుతం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. చట్టంలో ఏకరూపత తీసుకురావడానికి కేంద్ర పౌరస్మృతి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల మాట్లాడుతూ, ఉత్తరాఖండ్, గుజరాత్‌ల తరహాలో తమ ప్రభుత్వం 6నెలల్లోగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టి, రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని ప్రకటించారు. అంతేకాదు బంగాల్? కోసం ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్? రంజనా ప్రకాశ్ దేశాయ్? నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. బంగాల్ సర్కార్? ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, యూసీసీ ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన విషయాల్లో అన్ని వర్గాల వారికి సమానంగా పౌరచట్టాలను వర్తింపజేస్తారు.

జనవరి 25 నుంచి జనగణన

భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు 'సవరణ దశ' (రివిజనల్ రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే (సెల్ఫ్-ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు.

రెండు దశల్లో గణన

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు =+× జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "దేశంలోని ప్రతి రైతు, యువకుడు, ఆడబిడ్డ 'వికసిత భారత్' నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఇది కొందరికి నచ్చటం లేదు. దేశం కష్టాల్లో ఉంటే చూడాలనుకునే వాళ్లు దేశంపైకి ఏదైనా ఆపద వస్తే వారికి ఎంతో ఆనందం. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సమైక్యంగా సన్నద్ధమవుతుంటే.. వీళ్లు మాత్రం వదంతులు వ్యాప్తి చేయడంలో బిజీగా ఉన్నారు. కావాలనే తప్పుడు ప్రచారాలు సృష్టించారు. రైతులకు ఎరువులు దొరకవని భయపెట్టారు. కృత్రిమంగా క్యూలైన్లు సృష్టించి వాతావరణాన్ని చెడగొట్టారు. ఇకపై గ్యాస్ సిలిండర్లు దొరకవని మహిళలను భయపెట్టారు. దేశంలో అశాంతి, గందరగోళం సృష్టించడమే వారి లక్ష్యం"

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై సుప్రీం కీలక నిర్ణయం

కృష్ణా- గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ వివాదానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇతరుల మధ్య ఉన్న కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. ఈ మధ్యవర్తిత్వానికి అన్ని పక్షాలు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని వెల్లడించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్. పంచోలిలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ నియామకాన్ని ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందుకు కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణకు వచ్చింది. ఈ వివాదానికి సంబంధించి అన్ని పక్షాలు ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనలేకపోయాయన్న సమాచారం ధర్మాసనం దృష్టికి చేరింది. ఈ కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. 'ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోగలమేమో చూద్దాం. ఈ కేసులో మీరు (సుప్రీంకోర్టునుద్దేశించి) ఎవరిని మధ్యవర్తిగా నియమించాల నుకుంటే వారిని నియమించండి' అని సిబల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందించింది. కేజీ బేసిన్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ పేరును ప్రతిపాదించింది. ఆమెకు ఉన్న కమర్షియల్ లిటిగేషన్ బ్యాక్‌గ్రౌండ్, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాలు పరిష్కారం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. అలాగే ఇరుపక్షాలు సూచించిన ఇద్దరు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని మధ్యవర్తిని కోరతామని పేర్కొంది.

'వివాద పరిష్కారంలో మధ్యవర్తికి పూర్తిగా సహకరిస్తాం'

మరోవైపు, కేజీ బేసిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. తాము మధ్యవర్తికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇరు పక్షాలు మధ్యవర్తి ముందు తమ ప్రజెంటేషన్ ఇవ్వొచ్చని అన్నారు. మధ్యవర్తి ముందు పక్షాలు తమ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా కొంత సమయం కేటాయించాలని ధర్మాసనాన్ని కోరారు.

మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం!

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల రాజకీయాన్ని ఆర్గానిక్ వ్యవసాయంతో పోల్చిన ఆయన గుంటూరు మేయరు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాడికొండ శ్రీదేవి తరపున తమ పార్టీ మద్యం, డబ్బు పంచమని, గెలిపిస్తే మంచి పాలన అందిస్తామని వ్యాఖ్యానించారు. తాము నగరంలో ఆర్గానిక్ ఎలక్షన్స్ చేస్తామని అంబటి వ్యాఖ్యానించారు. “ఆర్గానిక్ వ్యవసాయం తెలుసు కదా’ మందులు వేయరు, ఎరువులు వేయరు. కానీ, పంట చాలా రుచిగా ఉంటుంది. మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం, మందులు, ఎరువులు వేయం” అంటూ చెప్పారు. పరోక్షంగా తాము ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయమని, మద్యం సరఫరా చేయమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో తాము ఘోరంగా ఓడిపోయామని వ్యాఖ్యానించిన అంబటి తమ పార్టీ తరపున ఎన్నికల్లో ఎటువంటి ఖర్చు చేయమని విస్పష్టంగా ప్రకటించడం హాట్ టాపిక్ అవుతోంది. విపక్షం వైసీపీలో మంచి మాటకారిగా అంబటి రాంబాబుకు పేరుంది. ముఖ్యంగా అధికార కూటమి పాలనను తనదైన శైలిలో విమర్శిస్తూ నిత్యం మీడియాను ఆకర్షిస్తుంటారు అంబటి. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో ధరల పెరుగుదలను ఎండగడుతూ ‘బియ్యం కిలో వంద రూపాయలు అయినందుకు చంద్రబాబు, లోకేశ్ కు ట్యాంక్స్’ అంటూ ట్వీట్ చేసి అధికార పక్షంపై వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు. ఒక్క మాటతో తమ అజెండాను వివరించిన అంబటి, ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యను హైలెట్ చేశారని అంటున్నారు. ఇక తాజాగా తమ పార్టీ పరిస్థితిని వివరిస్తూ ఆర్గానిక్ ఫార్మింగ్ ను ఉదహరించడంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది.
ఆర్గానిక్ ఫార్మింగ్ కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ పార్టీ కూడా ఆర్గానిక్ ఎన్నికలకు వెళుతున్నట్లు అంబటి చెప్పడం ఆకర్షించిందని అంటున్నారు. ఓడిపోయిన తమ వద్ద డబ్బు లేదని

చెప్పడంతోపాటు తమ పార్టీ తరపున నిలిపిన అభ్యర్థి సైతం పేద ఆర్యవైశ్య కులానికి చెందిన వారంటూ చెప్పి ఆ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారని అంటున్నారు. ఇదే సమయంలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులు తమ అభ్యర్థి తాడికొండ శ్రీదేవికి పార్టీలకు అతీతంగా ఓటు వేయాలని, ప్రతి ఒక్కరూ రూపాయి చొప్పున సాయం చేయాలని కోరారు. నోటు ఇవ్వాలి.. ఓటు వేయాలి అంటూ ఆయన ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు.టీడీపీ అభ్యర్థి ఆర్థికంగా ఉన్నవారని, వారిని డబ్బుతో ఢీకొట్టలేమని అంబటి పరోక్షంగా అంగీకరించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.డబ్బు ఖర్చు చేయనిదే ఎన్నికల్లో పాల్గొనలేని నేటి పరిస్థితుల్లో అంబటి చేసిన తాజా వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ప్రధానంగా ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నుంచి ఎలాంటి తాయిళాలు ఆశించవద్దని పార్టీ కేడర్ తోపాటు ఓటర్లకు మాజీ మంత్రి అంబటి సంకేతాలిచ్చారని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి, వైసీపీ మధ్య పోటీపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అధికారపక్షం తీరుపై విపక్షం ఘాటు విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి ఓటర్లను ఆలోచనలకు గురిచేసేలా మాటలతో మాయ చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కి కౌంట్ డౌన్ : జనం నాడి చిక్కుతుందా ?

విజయవాడ: పెన్ పవర్:ఏపీలో దాదాపుగా 30 నెలల తరువాత జనాలు ఓటు వేయబోతున్నారు. అయిదు విడతలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలి విడతకు నవంబర్ 1న తెర లేవనుంది. మొదటి విడతలో అర్బన్ బాడీస్ కి ఎన్నికలు జరుగుతున్నాయి. 87 మునిసిపాలిటీస్, 13 కార్పోరేషన్లు మొత్తంగా 100 చోట్ల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 1వ తేదీ ఏపీలో ఒక బిగ్ జడ్జిమెంట్ డే గా ఉండబోతోంది. ఏపీలో 2024 మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే సీట్లకు ఒకేసారి నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల అయ్యాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ కూటమి 95 సీట్ల షేర్ తో భారీ విజయాన్ని నమోదు చేసింది.

ప్రాధాన్యత అందుకే :
నామమాత్రంగా వైసీపీ మిగిలింది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నరేళ్ళ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మధ్యలో ప్రజల ఆలోచనలు ఎలా ఉన్నాయి, ప్రభుత్వ విధానాల మీద ప్రజలు ఏమనుకుంటున్నారు కూటమి పాలన సంతృప్తిని ఇచ్చిందా లేదా అన్నది ఎంతో కొంత స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో తెలుస్తుందా అన్నది అయితే చర్చగా ఉంది. ఎందుకంటే ఈ మధ్యలో మరే ఎన్నిక కానీ ఏ రకమైన తీర్పు కానీ జనం వైపు నుంచి రాలేదు, దాంతో స్థానిక సంస్థల ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దాంతో స్థానిక సంస్థల ఎన్నికలను అటు అధికార కూటమి ఇటు విపక్ష వైసీపీ కూడా చాలా సీరియస్ గానే తీసుకున్నాయి. దాంతో నామినేషన్ల పర్వం నుంచే ఘర్షణ వాతావరణం ఏర్పడింది అని గుర్తు చేస్తున్నారు.

సహజంగా చూస్తే :
ఇక స్థానిక సంస్థల ఎన్నికల తీరు చూస్తే సహజంగా అధికారంలో ఎవరు ఉంటారో వారి వైపే జనం తీర్పు ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వంలో ఉన్న పార్టీలకు ఓటు చేస్తే తమకు మేలు జరుగుతుందని, స్థానికంగా తమ ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతుందని భావిస్తారు. అంతే కాదు ప్రభుత్వంతో కలసి నడవాలని మెజారిటీ జనాలు అనుకుంటారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మీద పెద్దగా అంచనాలు అయితే రాజకీయంగా లేకపోయినా కొన్ని చోట్ల నుంచి వచ్చే విలక్షణ తీర్పులు మాత్రం ప్రత్యేకం అవుతాయి. వాటినే పట్టుకుని నిశితంగా పరిశీలన చేయడం జరుగుతుంది.

ఏకమొత్తంగా అంటూ :
ఇక ఏకమొత్తంగా నూరు శాతం స్ట్రైక్ రేట్ ని కూటమి పార్టీలు సాధించాలని ఆ వైపు నుంచి ఘనమైన నినాదం వినిపిస్తోంది. 2024లో వచ్చిన రిజల్ట్ నే రిపీట్ చేయాలని కూడా కూటమి పార్టీలు కోరుకుంటున్నాయి. అదే సమయంలో రెండున్నరేళ్ల పాలన అంటే సగం పూర్తి అయినట్లే. దాంతో ఎక్కడో ఒక చోట అసంతృప్తి ఉంటుంది అని దానిని వెలికి తీస్తే తమకు 2029 ఎన్నికలకు దారి దొరికినట్లే అని విపక్ష వైసీపీ భావిస్తోంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికల్లో గట్టిగా తేల్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. మొత్తం ఫలితాలు ఒక్కలా ఉండవని ఎంతో కొంత తేడా కనిపించినా అది తన విజయంగా భావించాలని దానినే పెద్దది చేసి చూపించాలని తద్వారా ప్రజల నాడిని పట్టుకుని ఇదే రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తీర్పుగా మార్పుగా చూడాలని వైసీపీ భావిస్తుంది అన్నది కూడా ఉంది.

మంచిదే కదా :
అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ మాత్రం ప్రతికూలత ఎక్కడ వచ్చినా దానిని సరిదిద్దుకునే చాన్స్ అధికార కూటమికి కచ్చితంగా ఉంటుంది. చేతిలో ఇంకా సగం పాలన ఉంటుంది కాబట్టి ఆ విధంగా చక్కబెట్టుకుని 2029 నాటికి గట్టిగా జనం వద్దకు వెళ్ళవచ్చు. అలా జనం ఏమనుకుంటున్నారు అన్నది తెలియడం అధికారంలో ఉన్న వారికే అవసరం అని అంటున్నారు. మరి అలా జరుగుతుందా జనం ఎక్కడైనా తమ భావనలు బయట పెడతారా లేదా గుంభనంగా ఉంటూ అధికార కూటమికే జై కొడతారా అన్నదే చూడాల్సి ఉంది. మొత్తం మీద చూస్తే కనుక లోకల్ బాడీస్ లో ఎంతో కొంత జనం నాడి పట్టడానికి పార్టీలే కాదు రాజకీయ విశ్లేషకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి అలా జరుగుతుందా లేదా అన్నదే ఇంట్రెస్టింగ్ మ్యాటర్.

పనబాక కుమార్తెకు కీలక పదవి.. టీడీపీ అధిష్టానం సంకేతాలు

విజయవాడ: పెన్ పవర్:తిరుపతి జిల్లా పరిషత్ మొదటి ఛైర్‌పర్సన్‌గా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కుమార్తె డాక్టర్ పనబాక చేతన పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన తిరుపతి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని చేతనతోపాటు మాజీ ఎమ్మెల్యే హేమలత ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే యవత, విద్యావంతురాలు అన్న ఆలోచనతో అధిష్టానం డాక్టర్ చేతన పేరుపై మొగ్గు చూపుతోందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే డాక్టర్ చేతన పేరును ఖరారు చేసిందని, అధికారిక ప్రకటన ఒక్కటే విడుదల చేయాల్సివుందని అంటున్నారు. సీనియర్ నాయకురాలు పనబాక లక్ష్మి సేవలు, సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తగిన న్యాయం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తొలి ఛైర్‌పర్సన్‌గా చేతన
తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత జిల్లా పరిషత్‌కు జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరడంతో జడ్పీ పరిధి కూడా విస్తరించింది. ఈ నూతన జిల్లా పరిషత్‌కు తొలి ఛైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు, యువ నాయకురాలు డాక్టర్ పనబాక చేతన పేరును అధిష్టానం ఖరారు చేసేందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. శ్రీకాళహస్తి రూరల్ జడ్పీటీసీ సభ్యురాలిగా చేతన ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయంలోకి కొత్తగా అడుగుపెట్టినప్పటికీ, మొదటి ప్రయత్నంలోనే జడ్పీటీసీగా ఏకగ్రీవంగా గెలుపొంది తన సత్తా చాటారు. ఇప్పుడు

అధిష్టానం అవకాశం ఇస్తే, తిరుపతి జిల్లా పరిషత్‌కు మొట్టమొదటి జడ్పీ ఛైర్‌పర్సన్గా చరిత్రకెక్కే అవకాశముందని అంటున్నారు.

పనబాక లక్ష్మి సీనియార్టీకి గుర్తింపు
కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ పట్ల ఆమె చూపిన నిబద్ధత, సీనియార్టీని గుర్తించిన అధిష్టానం ఆమెకు టిటిడి బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ, ఆమె ఉన్నత స్థాయి రాజకీయ అనుభవానికి తగినంత గుర్తింపు ఇంకా దక్కలేదన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పనబాక లక్ష్మి కుమార్తె చేతనకు జిల్లా స్థాయిలో అత్యున్నతమైన జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టడం ద్వారా పనబాక కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేయాలని టీడీపీ యోచిస్తోందని అంటున్నారు.

ఉన్నత విద్యావంతురాలు
డాక్టర్ పనబాక చేతన డెర్మటాలజీ (చర్మ వైద్యం)లో ఎండి చేసిన ఉన్నత విద్యావంతురాలు. కేంద్ర మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ వినయం, సౌశీల్యం, మృదుభాషణ విడవని పనబాక లక్ష్మి పెంపకంలో పెరిగిన చేతన, అదే సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా గౌరవించే వ్యక్తిత్వం పనబాక లక్ష్మి సొంతమని, అటువంటి విలువలున్న కుటుంబం నుంచి వచ్చిన చేతన టీడీపీకి అత్యంత గౌరవప్రదమైన అభ్యర్థి అవుతారనడంలో సందేహం లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో పనబాక లక్ష్మి తిరుపతి లోక్‌సభకు పోటీ చేసిన సమయంలో చేతన విస్తృత ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ స్వల్ప రాజకీయ అనుభవంతో ఏకంగా జడ్పీ ఛైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం..

విజయవాడ: రిటైర్డ్ డీజీపీ ఎస్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపంవ్యక్తం చేశారు. బాలసుబ్రహ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ..
“బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకున్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు” అనివ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీమాజీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. “నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించిముక్కుసూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మణ్యం గారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనానైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటి వారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి” అని లోకేశ్ నివాళులర్పించారు.

విశాఖ విజయవాడ.... హీటెక్కించే రిజల్ట్స్ !

ఏపీలో మొత్తం 13 కార్పోరేషన్లకు నవంబర్ 1న పోలింగ్ జరగబోతోంది. అందులో ఉత్తరాంధ్రా గోదావరి కోస్తా రాయలసీమ జిల్లాలలో కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నవి రెండే కార్పోరేషన్లు అని అంటున్నారు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ గా విశాఖ ఉంది. 120 వార్డులు అంటే ఏపీలో మరెక్కడా లేవు. అలాగే టాప్ టెన్ కార్పోరేషన్లలో దేశంలో ఒకటిగా జీవీఎంసీ ఉంది. ఆదాయంలో అభివృద్ధిలో అలాగే ఏపీలో మెగా సిటీగా విశాఖ ఉంది. విశాఖ మీద ఏ ప్రభుత్వం ఉన్నా ప్రత్యేక ఫోకస్ పెడుతుంది. దాంతో విశాఖను గెలుచుకోవాలని పట్టుదలతో రాజకీయ పక్షాలు చూస్తాయి. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే విశాఖ ఒక సెంటిమెంట్ గా ఉంది. 1987లో తొలిసారి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగినపుడు టీడీపీ మేయర్ సీటుని గెలుచుకుంది. అది జరిగిన తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల టీడీపీ విశాఖ మేయర్ పీఠం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అందుకే ఈసారి కూటమి పార్టీలు కోరినా ఇవ్వకుండా తానే పోటీ పడుతోంది.

ఎపుడూ భిన్నంగానే :
విశాఖ ఓటర్లు ఎప్పుడూ భిన్నంగా తీర్పు ఇస్తారు. వారు అభివృద్ధిని కోరుకుంటారు. దానితో పాటు ప్రశాంతత ఈ ప్రాంతం స్పెషాలిటీ. అందుకే రాజకీయ పక్షాలు కూడా ఇక్కడ సాఫీగానే ప్రచారం చేస్తూ వస్తాయి. టీడీపీ కూటమికి అయితే తమకు మేయర్ పీఠం కచ్చితంగా దక్కుతుందని నమ్మకం ఉంది. పైగా జీవీఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కూటమికి చెందిన వారే. దాంతో గెలుపు నల్లేరు మీద నడక అని భావిస్తున్నా ఎక్కడా తగ్గడం లేదు, ఎందుకంటే ప్రజా క్షేత్రంలో పోరు ఎప్పటికప్పుడు వెరైటీగానే ఉంటుంది. పైగా 18 లక్షల ఓటర్లు ఓటు వేయబోతున్నారు. 2024 తరువాత కొత్త ఓటర్లు, జెన్ జీలు ఉన్నారు.

వైసీపీ గట్టిగానే :
వైసీపీ కూడా విశాఖ మేయర్ సీటు విషయంలో గట్టిగానే పోటీ పడుతోంది. తమకు బలం ఉందని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. అభ్యర్థి విషయంలో వైసీపీ సక్సెస్ అయింది. ఎమ్మెల్సీగా ఉన్న వరుదు కళ్యాణిని నిలబెట్టి జనానికి పరిచయం ఉన్న బీసీ మహిళతో రాజకీయంగా ముందుకు సాగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం మీద వచ్చే యాంటీ ఇంకెంబెన్సీ మీదనే వైసీపీ ఆశలు పెట్టుకుంది. అలాగే కూటమిలో లుకలుకలు ఉంటే అవి తమకు ఎంతో కొంత అనుకూలిస్తాయేమో అన్నది కూడా వైసీపీలో ఎక్కడో ఉంది అని అంటున్నారు. దాంతో తీర్పు విషయంలో ఉత్కంఠ ఉంది అంటున్నారు.

వంగవీటి బ్రాండ్ తో :
ఇక విజయవాడ మీద అందరి చూపు ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తే మరో తీర్పుగా దీనిని చూడాలి. పుష్కర కాలం తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో వంగవీటి రాధాక్రిష్ణ మేయర్ సీటుకు పోటీగా ఉన్నారు. ఆయన జనసేన నుంచి బరిలో ఉండడం రాజకీయంగా సామాజికపరంగా మరో ఆసక్తిని పెంచే పరిణామం. అలాగే వంగవీటి బ్రాండ్ పొలిటికల్ గా ఎపుడూ గట్టిగానే పనిచేస్తుంది. ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని కూటమి నమ్మకంగా ఉంది. టీడీపీ జనసేన కలసికట్టుగా బరిలోకి దిగుతోంది కాబట్టి రిజల్ట్ ఇక్కడ రీ సౌండ్ చేస్తుంది అంటున్నారు.

ఏబీవీ ఎంట్రీతో :
ఇక వైసీపీ నుంచి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పోటీకి దిగారు. బీసీ ఓటు తో వైసీపీ ఇక్కడ ట్రంప్ కార్డునే వాడుతోంది. బీసీలు వలస వచ్చి నివాసం ఉంటున్న వారు మైనారిటీలు తమ వైపు అని వైసీపీ భావిస్తోంది. ఇక మేయర్ గా అయిదేళ్ళు పనిచేసిన భాగ్యలక్ష్మి అందరికీ తెలిసిన వారుగా ఉంటారు కాబట్టి ప్లస్ అవుతుందని ఊహిస్తోంది. అయితే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఎంట్రీతోనే అసలు ఇంట్రెస్ట్ మొదలైంది. ఆయన ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆయన ప్రభావం ఎంత ఉంటుంది, ఏ మేరకు ఉంటుంది అన్నదే చర్చగా ఉంది. అలాగే ఆయన తీసుకునే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయి అన్నది మరో చర్చ. ఆయన ఎంట్రీతో వైసీపీ నష్టపోతుంది అని ఒక విశ్లేషణ ఉంటే టీడీపీకి కొంత ఇబ్బంది అని మరో చర్చగా ఉంది. ఏది ఏమైనా విజయవాడ అంటే రాజకీయ రాజధాని, ఇక్కడ మేయర్ అంటే నగర ప్రథమ పౌరుడు. అందువల్ల ఈ ఎన్నిక మీద ఏపీ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అలా ఏపీలో విశాఖ విజయవాడ ఎన్నికల ఫలితాలు అయితే హీటెక్కించబోతున్నాయని అంటున్నారు.

రాజకీయ మనుగడగా నిత్యావసరాలు

రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలేందుకు పెద్ద పెద్ద సమస్యలో లేదా సిద్ధాంతపరమైన విభేదాలో అవసరం లేదు. సగటు సామాన్యుడి రోజువారీ కిచెన్ బడ్జెట్ తలకిందులైతే చాలు! కడుపు నిండా తినే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు, ప్రజల్లో వ్యక్తమయ్యే ఆగ్రహం నేరుగా పాలకపక్షాల గ్రాఫ్‌ను వేగంగా పడదోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఎల్ నినో తీవ్రత వల్ల ఏర్పడిన అకాల వర్షాలు, పండగల రద్దీ, వాతావరణ మార్పుల ధాటికి ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధరల మంట ప్రజావ్యతిరేకతగా మారకముందే అదుపుచేసేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రూ.కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడుతుండటం ఆసక్తికరమైన రాజకీయ సమీకరణగా మారింది.ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యుడిని కాపాడేందుకు ప్రత్యేక కౌంటర్లు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. నెలకు సుమారు రూ. 100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్, రూ.25కే గోధుమపిండి అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా అందుబాటులోకి తెస్తూ మార్కెట్ ధరలపై ఒత్తిడి పెంచి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల అసంతృప్తిని చల్లబరిచేందుకు ఏకంగా రేషన్ కార్డుదారులకు ప్రత్యేక నిత్యావసరాల కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర వంటి 6 రకాల నిత్యావసరాలతో కూడిన సబ్సిడీ కిట్లను అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బహిరంగ మార్కెట్లో ధరలను విచ్చలవిడిగా పెంచే వ్యాపారుల నిర్బంధ తనిఖీలతో పాటు, ప్రభుత్వం నేరుగా ఈ సబ్సిడీ కిట్లను ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుకూలత తెచ్చుకోవాలని భావిస్తోంది.ఆర్థికంగా తీవ్ర లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్ణకై ఇంత భారీగా నిధులు వెచ్చించడానికి ప్రధాన కారణం ఓటు బ్యాంకు ముప్పు! ఉచిత పథకాలు ఎంత అందజేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి పాకెట్ మనీ ఖాళీ అయిపోతుంది. దీనివల్ల ప్రభుత్వాల సంక్షేమ పథకాల ఇంపాక్ట్ సున్నాగా మారి, హామీలు ఇచ్చారు కానీ పొట్ట నింపడం లేదు అనే నిరసన స్వరం గ్రామాల్లో బలంగా వినిపించే ప్రమాదం ఉందనేది పొలిటికల్ సర్వేల హెచ్చరిక. ఈ నిత్యావసరాల ధరల నియంత్రణ అంశం రెండు ప్రభుత్వాలకు సంజీవనిలా మారనుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతరం నిఘా ఉంచడం, లభ్యత కొరత రాకుండా ముందస్తుగా దిగుమతులు చేసుకోవడం ద్వారా ప్రజాసంతోషాన్ని కాపాడుకోవడమే ఏపీ, తెలంగాణ సీఎంల ప్రధాన అజెండా.జాతీయ, అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన నిత్యావసరాల కొరతను కేవలం పరిపాలనా సమస్య గా చూడకుండా, 'రాజకీయ మనుగడ' సమస్యగా భావించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు భారాన్ని తమ భుజాన వేసుకోవడం రాజకీయంగా అత్యంత వ్యూహాత్మకమైన అడుగుగా భావించవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ పెన్ పవర్:
దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ప్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం.ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

యువకెరటం జయకేతనం!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేడు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు. ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

డీఏ బకాయిలు.. పెన్షన్‌కు ముప్పు



కరువు భత్యం అంటే ప్రభుత్వం ఉద్యోగికి అదనంగా ఇస్తున్న డబ్బు కాదు. ధరలు పెరిగినప్పుడు వేతనం కొనుగోలు శక్తి తగ్గకుండా కొంతమేర భర్తీ చేయాల్సిన హక్కు. అందుకే డీఏ ఉత్తర్వు వచ్చిన రోజు ఉద్యోగులు దాన్ని కొత్త ప్రయోజనంగా చూడరు. తనకు రావాల్సిన డబ్బు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తారు. ఆ ఎదురుచూపు నెలలుగా, ఏండ్లుగా సాగితే అది కేవలం నగదు కొరతగా మిగలదు. ముఖ్యంగా సీపీఎస్ ఉద్యోగికి ప్రతి ఆలస్యమూ అతని రిటైర్మెంట్ భద్రతపై కూడా ప్రభావం చూపుతుంది. ఉద్యోగం చేస్తున్న రోజుల్లో జీతం కనిపిస్తుంది. రేపటి పెన్షన్ కనిపించదు. కానీ ఆ కనిపించని భవిష్యత్తు కోసం ఈరోజే డబ్బు జమ కావాలి.

సీపీఎస్ ఉద్యోగి పరిస్థితి సున్నితమైంది. జీతం నుంచి ప్రతి నెలా చందా మినహాయించి పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్ఏఎన్) ఖాతాలో జమ చేస్తారు. ఆ డబ్బు మార్కెట్ ఆధారిత పెట్టుబడుల్లోకి వెళ్తుంది మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. పెరుగుతుంది, పడిపోతుంది. అందుకే సకాలంలో చందా జమ కావడం ఒక రకంగా క్రమబద్ధమైన పెట్టుబడి విధానంలా పనిచేస్తుంది. మార్కెట్ పడినప్పుడు అదే మొత్తంతో ఎక్కువ యూనిట్లు రావచ్చు. పెరిగినప్పుడు తక్కువ యూనిట్లు రావచ్చు. ఈ ఒడిదొడుకుల మధ్య క్రమంగా పెట్టుబడి కొనసాగడమే దీర్ఘకాలంలో దాని బలం. కానీ ప్రభుత్వం ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని నెలల తరబడి ఆలస్యం చేసి, మార్కెట్ పరిస్థితులు మారిన తర్వాత జమ చేస్తే..ఆ పెట్టుబడికి దక్కాల్సిన సమయాన్ని మాత్రమే కాదు, ఆ సమయంలో లభించే అవకాశాన్ని కూడా ఉద్యోగి కోల్పోవచ్చు. ఒక చిన్న ఉదాహరణ ఈ నష్టాన్ని అర్థం చేసుకునేలా చేస్తుంది. రిటైర్మెంట్ ఖాతాలో రూ.50 వేలు సకాలంలో జమై, సగటున 8 శాతం వార్షిక రాబడి వచ్చిందని అనుకుంటే..20 ఏండ్లలో అది సుమారు రూ.2.33 లక్షలు అవుతుంది. అదే రూ.50 వేలు మూడేండ్లు ఆలస్యంగా జమైతే పెట్టుబడి కాలం 17 ఏండ్లకు తగ్గి సుమారు రూ.1.85 లక్షలే అవుతుంది. అంటే దాదాపు రూ.48 వేల తేడా. ఇది నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)లో హామీ ఇచ్చిన రాబడి కాదు. కేవలం ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి తీసుకున్న ఉదాహరణ మాత్రమే. ఆలస్యమైన డబ్బు తర్వాత జమ చేయవచ్చు..కోల్పోయిన పెట్టుబడి సమయాన్ని మాత్రం తిరిగి జమ చేయలేం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎన్‌పీఎస్‌పై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ (కాగ్), చందాలు సకాలంలో జమ కాకపోవడం వల్ల పెన్షన్ పొదుపుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాన్ని గుర్తించింది. ఉద్యోగి చందా ఆలస్యంగా పెట్టుబడిగా మారితే, ఆ మొత్తానికి దక్కాల్సిన పెట్టుబడి కాలం తగ్గుతుంది. అంటే చందా ఆలస్యం అనేది కేవలం లెక్కల్లో ఒక తేదీ మారడం కాదు.

రిటైర్మెంట్ నిధి పెరిగే అవకాశాన్నే తగ్గించడం. అందుకే చందాలు ఆలస్యమైతే ఉద్యోగికి నష్టం కలుగకుండా పరిహారం, వడ్డీ, బాధ్యుల జవాబుదారీతనం వంటి అంశాలను కేంద్ర నిబంధనలు కూడా ప్రస్తావించాయి. అయితే కరువు భత్యం (డీఏ) బకాయిల విషయంలోనూ ఇదే సూత్రాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడే అసలు బాధ మొదలవుతుంది. ఇరవై, ముప్ఫై ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులు రిటైర్ అయ్యే నాటికి తన జీవితానికి ఒక భరోసా ఉంటుందని ఆశిస్తారు. కానీ సీపీఎస్‌లో రిటైర్మెంట్ తర్వాత వచ్చే ఆదాయం ఎంత ఉంటుందన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేం. ఇప్పటికే కొందరు రిటైర్డ్ ఉద్యోగులు తమకు నెలకు నాలుగు, ఐదు వేల రూపాయల స్థాయిలోనే పెన్షన్ వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి పరిస్థితి ఒకేలా ఉండకపోయినా, ఈ అనుభవం ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నది. ప్రభుత్వానికి ఇరవై, ముప్ఫై ఏండ్లు సేవ చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతపై ఇంత అనిశ్చితి ఉంటే, ఉద్యోగికి తన భవిష్యత్తుపై భరోసా ఎలా ఉంటుంది? ప్రభుత్వం కూడా ఒక విషయాన్ని గుర్తించాలి. ఆర్థిక భారం తగ్గించుకోవడానికి డీఏ బకాయిలను విడతల్లో చెల్లించడం ఒక పరిపాలనా నిర్ణయం కావచ్చు. కానీ రిటైర్మెంట్ ఖాతాకు వెళ్లాల్సిన ఉద్యోగి, ప్రభుత్వ చందాలను మాత్రం ఆ విడతల కోసం ఆపకూడదు. డీఏ బకాయి విడుదలైన వెంటనే ఉద్యోగి వాటాతోపాటు ప్రభుత్వ వాటాను కూడా పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేయాలి. ప్రతి నెలా సాధారణ చందా కూడా నిర్ణీత గడువులో జమయ్యేలా ఆటోమేటిక్ వ్యవస్థ ఉండాలి. ఉద్యో గి తన డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. అతని ఖాతాలో డబ్బు ఎప్పుడు జమైందో, ఎంత జమైందో స్పష్టంగా కనిపించేలా వ్యవస్థ ఉండాలి. ఉద్యోగి భవిష్యత్తు భద్రతకు సంబంధించిన డబ్బును 'తర్వాత చూద్దాం' అనే ఖాతాలో పెట్టలేం. ఒక డీఏలోని రూ.50 వేల రిటైర్మెంట్ భాగం మూడేండ్లు ఆలస్యమైతే పైన తెలిపిన ఉదాహరణ లెక్క ప్రకారం దాని భవిష్యత్తు విలువలో దాదాపు రూ.48 వేల తేడా కనిపిస్తున్నది. ఇంకా చెల్లించాల్సిన డీఏ బకాయిలు, భవిష్యత్తులో ఆలస్యమయ్యే చందాలు కూడా ఇదే విధంగా ప్రభావితం చేస్తే.. నష్టం ఒక్క ఉద్యోగికి మాత్రమే పరిమితం కాదు. ప్రజలకు సేవ చేయాల్సిన వ్యక్తి తన ఉద్యోగం గురించి, వృద్ధాప్యం గురించి ఆందోళన పడుతూ పనిచేయాల్సిన పరిస్థితి ఏ వ్యవస్థకూ మంచిది కాదు. ఉద్యోగి భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. డీఏ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారనేదే కాదు..సీపీఎస్ ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని ఎప్పుడు పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేస్తారన్నదీ ముఖ్యమే. 2030 ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన తర్వాత వృద్ధాప్యంలో భరోసా కోసం ఎదురుచూసే పరిస్థితి రాకూడదు. ఉద్యోగి జీవితమంతా చెల్లించిన చందాలు, రావాల్సిన బకాయిలు చివరికి అతని వృద్ధాప్యానికి అండగా నిలవాలి. డబ్బు ఆలస్యంగా ఇవ్వొచ్చు.. కానీ ఆ డబ్బు పెరగాల్సిన కాలాన్ని మళ్లీ ఇవ్వలేం.

‘న్యూజిలాండ్ టూర్‌లో మా లక్ష్యం అదే’..

కోచ్ గంభీర్ ప్లాన్స్‌ను బయటపెట్టిన వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ భారత్ 3-0తో కైవసం
మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే లక్ష్యమన్న వరుణ్
గంభీర్ సూచనలను వెల్లడించిన వరుణ్
భారత బ్యాటర్లపై స్పిన్నర్ ప్రశంసలు
తన ఫిట్‌నెస్ మెరుగైందన్న వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను ఇప్పటికే 3-0తో కైవసం చేసుకున్నా.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే తమ లక్ష్యమని భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పష్టం చేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌నూ గెలవాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమకు సూచించారని తెలిపాడు. సిరీస్ గెలిచేశామనే ధీమాతో కాకుండా, మిగిలిన రెండు మ్యాచ్‌లను కూడా కీలకంగా తీసుకుంటామని చెప్పాడు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం నాలుగో టీ20కి ముందు వరుణ్ మాట్లాడాడు. “ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాలని గంభీర్ మొదటే చెప్పారు. అదే మా లక్ష్యం. మిగిలిన రెండు మ్యాచ్‌లను రెండు మ్యాచ్‌ల సిరీస్‌గా భావిస్తున్నాం. ఆ రెండింటిలోనూ గెలవాలి” అని పేర్కొన్నాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించింది. భారత బ్యాటర్ల దూకుడును వరుణ్ ప్రశంసించాడు. అంతకుమించిన ప్రదర్శన చేయడం కష్టమేనని, అయితే మరోసారి అదే తరహా ఆటను చూడాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు. చిన్న మైదానాలు, ఇలాంటి పిచ్‌లపై ఆడటానికి భారత బ్యాటర్లు అలవాటు పడటం జట్టుకు కలిసొచ్చిందని అభిప్రాయపడ్డాడు. ఇటీవల గాయంతో ఇబ్బందిపడిన వరుణ్ ప్రస్తుతం తాను మెరుగైన స్థితిలో ఉన్నట్లు తెలిపాడు. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ సందర్భంగా పక్కటెముకల పక్కన కండరాల గాయానికి గురైన అతడు.. ఆసియా క్రీడలతో పాటు జపాన్‌తో జరిగిన ఏకైక టీ20కి దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపికైనా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడలేదు. “ఇప్పుడు చాలా మెరుగ్గా ఉన్నా. ఆడేందుకు సిద్ధంగా ఉన్నా” అని తన ఫిట్‌నెస్‌పై స్పష్టత ఇచ్చాడు. భారత జట్టులో పెరుగుతున్న పోటీ గురించి కూడా వరుణ్ స్పందించాడు. దేశంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నందున జట్టులో చోటు కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని చెప్పాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా విశ్రాంతికే పరిమితం కాకుండా, తనను తాను మెరుగుపరుచుకుంటూ మంచి ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించాలని తెలిపాడు.

ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులు.. బ్యాటింగ్ కోచ్‌గా రాబిన్ ఊతప్ప!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్టార్ క్రికెటర్ రాబిన్ ఊతప్పను తమ కొత్త బ్యాటింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. ఇప్పటివరకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న కీరన్ పొలార్డ్‌కు హెడ్ కోచ్‌గా ప్రమోషన్ లభించడంతో, ఆ స్థానంలోకి ఊతప్పను తీసుకువచ్చింది. గత ఐపీఎల్ 2026 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలు సాధించి తొమ్మిదో స్థానంలో నిలిచిన నేపథ్యంలో ముంబై యాజమాన్యం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టింది. కొన్ని రోజుల క్రితమే శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్‌ను హెడ్ కోచ్‌గా నియమించిన ముంబై, ఇప్పుడు పూర్తిస్థాయిలో కొత్త బృందాన్ని సిద్ధం చేసింది. రాబిన్ ఊతప్ప నియామకాన్ని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ.. “ఆటపై అద్భుతమైన అవగాహన, యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేసే స్పష్టత ఉన్న రాబిన్‌కు తిరిగి స్వాగతం” అని ముంబై ఇండియన్స్ పేర్కొంది. ఊతప్ప 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో ముంబై తరఫున ఆడటం విశేషం. ఈ మార్పుల్లో భాగంగా బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనగన్‌ను, ఫీల్డింగ్ కోచ్‌గా టి. దిలీప్‌ను, డెవలప్‌మెంట్ బౌలింగ్ కోచ్‌గా ధవళ్ కులకర్ణిని నియమించారు. దీంతో హెడ్ కోచ్ పొలార్డ్ నేతృత్వంలో కొత్త కోచింగ్ బృందం ఏర్పడింది. గురువారం నాడు బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్‌లు జట్టును వీడుతున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన ఊతప్ప, తన ఐపీఎల్ కెరీర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2014లో 660 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు. ఇక కొత్త బౌలింగ్ కోచ్ మెక్‌క్లెనగన్ 2015-2020 మధ్య ముంబై తరఫున ఆడి నాలుగుసార్లు టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ భారత జట్టుతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన భారత జట్టు కోచింగ్ బృందంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. మొత్తంమీద గత సీజన్‌లోని వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని, పాత ఆటగాళ్ల అనుభవాన్ని జోడించి, రాబోయే సీజన్‌లో బలంగా పుంజుకోవాలని ముంబై ఇండియన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

స్పోర్ట్స్

టీమిండియాకు బిగ్ షాక్..
న్యూజిలాండ్ సిరీస్‌కు స్టార్ పేసర్ ఔట్!

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరికొంత సమయం పడుతుందని వెల్లడించింది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాలకు గాయమైంది. అప్పటి నుంచి అతడు కోలుకుంటున్నాడు. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన బౌలింగ్ భారాన్ని తట్టుకునే స్థాయికి ఇంకా చేరుకోలేదు. దీంతో న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో అతడికి అవకాశం లేకుండా పోయింది.

భారత్-ఏ జట్టుతో మ్యాచ్ ప్రాక్టీస్

ప్రసిద్ధ్ కృష్ణ త్వరలోనే భారత్-ఏ జట్టుతో కలవనున్నాడు. న్యూజిలాండ్-ఏతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం ముందుగా ‘రిటర్న్ టు ప్లే’ (ఆర్‌టీపీ) ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ మ్యాచ్ ద్వారా ప్రాక్టీస్ పొందడంతో పాటు టెస్టు సిరీస్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

సిరాజ్, నితీశ్ రెడ్డికి కొత్త బాధ్యతలు

మరో పేసర్ మహమ్మద్ సిరాజ్ అక్టోబర్ 31 నుంచి ప్రారంభమయ్యే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం భారత్-ఏ జట్టుతో చేరనున్నాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మాత్రం నవంబర్ 4న జరిగే తొలి వన్డేలో భారత్ తరఫున ఆడతాడు. ఆ తర్వాత భారత్-ఏ జట్టుతో కలుస్తాడు. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు ఆటగాళ్లను సిద్ధం చేయడంలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

పూజా హెగ్డే
కొత్త ఫ్యాషన్
ప్రమాణాలను
నెలకొల్పుతోంది

బాలయ్య ఏం చేసినా..
ప్లాన్ మిస్ అవ్వదు!

స్టార్ హీరోల సినిమాల్లో కనిపించే అవకాశం వచ్చినప్పుడు చాలామంది వెంటనే ఓకే చెప్పేస్తారు. కానీ సీనియర్ హీరో నటసింహం బాలయ్య లెక్క మాత్రమే వేరని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. తన ఇమేజ్ కు ఎంత యూజ్ ఉంటుంది, ఎలాంటి ఎఫెక్ట్ చూపించగలదనే విషయాలను ఆయన లెక్కలోకి తీసుకుంటారనే అభిప్రాయం ఉంది. అందుకే ఇప్పుడు జైలర్ సిరీస్ విషయంలో బాలకృష్ణ పేరు మళ్లీ వినిపిస్తుండటంతో ఆయన స్ట్రాటజీపై చర్చ మొదలైంది.

వాస్తవానికి.. బాలకృష్ణకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మాస్ ఫాలోయింగ్ గురించి స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన స్క్రీన్ పైకి వస్తే అభిమానులు కోరుకునే హంగామా వేరుగా ఉంటుంది. డైలాగులు, ఫైట్లు, ఎంట్రీ.. ఇలా ప్రతి విషయంలో కూడా బాలయ్య మార్క్ కనిపించాలని ఆశిస్తారు. అందుకే ఆయన ఏ సినిమాలో కనిపించినా, ఆ రోల్ కు తగిన ఇంపార్టెన్స్ ఉండటం ముఖ్యం.అదే ఇప్పుడు జైలర్ సిరీస్ విషయంలో ఆసక్తిని పెంచుతోంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన జైలర్ పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఆ సినిమాలో ఇతర భాషలకు చెందిన స్టార్ హీరోలు అతిథి పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. రీసెంట్ గా వచ్చిన జైలర్ 2 మూవీలో కూడా క్యామియో రోల్స్ సందడి కనిపించింది. అయితే ఆ మూవీలోని ఓ కీలక పాత్ర కోసం నెల్సన్ బాలయ్యను సంప్రదించారనే కొన్ని రోజుల క్రితం వార్తలు వచ్చాయి.కానీ ఆ రోల్ రన్ టైమ్ చాలా తక్కువగా ఉండటంతో బాలయ్య ఓకే చెప్పలేదని ప్రచారం జరిగింది. ఇప్పుడు ‘జైలర్-3’లో ఆయన కోసం మరింత స్ట్రాంగ్ రోల్ రెడీ అయిందని, ఇప్పటికే బాలయ్య ఓకే కూడా చెప్పారని టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఆ ప్రచారంలో నిజం ఉంటే, బాలయ్య పాత్రల ఎంపిక విషయంలో ఎలాంటి లెక్కలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. రజనీకాంత్ లాంటి సూపర్ స్టార్ సినిమాలో కనిపించడం ఒక ప్రత్యేకతే.కానీ తన రేంజ్ కు తగ్గ పాత్ర దక్కితే ఆ ఛాన్స్ కు మరింత వాల్యూ ఉంటుంది. కథలో ఇంపార్టెన్స్ ఉండటంతో పాటు, మాస్ ఇమేజ్‌ను చూపించే అవకాశం కూడా రావాలి. అప్పుడే ఆ పాత్ర అభిమానులకు గుర్తుండిపోతుంది. అంతేకాదు, రజనీతో కలిసి స్క్రీన్ పై కనిపిస్తే ఇద్దరి అభిమానుల్లోనూ భారీ అంచనాలు ఏర్పడతాయి. అయితే బాలయ్య కావాలనే రెండో పార్టు వదిలి మూడో పార్ట్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పడానికి ప్రూఫ్స్ లేవు.అలా స్టార్ హీరోలకు అవకాశాలు రావడం ఒక ఎత్తయితే, తమ ఇమేజ్ కు సరిపోయే పాత్రను ఎంచుకోవడం మరో ఎత్తు. బాలయ్య విషయంలో కూడా ఆ లెక్కే క్రేజ్ పెంచుతోంది. చిన్న రోల్ లో కనిపించి వెళ్లిపోవడం కంటే, తన రేంజ్ చూపించే రోల్ దక్కితేనే కాంబోకి వాల్యూ విలువ ఉంటుంది. అందుకే బాలయ్య ఏం చేసినా దాని వెనుక ఓ ప్లాన్ ఉంటుందనే చర్చ అభిమానుల్లో ఇప్పుడు నడుస్తోంది.

స్టైలిష్ స్విమ్‌సూట్‌లో
పూల్ పక్కన
మెరిసిపోతున్న షామా
సికందర్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com